క్లుప్తంగా

ముసురు వర్షం

ధరూరు: మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా ముసురు కురుస్తోంది.ఉదయం నుంచి సాయంత్రం వరకు అడపాదడప చినుకులు పడుతుండడంతో రైతులు, వ్యవసాయ కూలీల పనులు ముందుకు సాగడంలేదు. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో సాయంత్రం 5 గంటలు దాటితే చిన్నారులు, వృద్ధులు బయటకు రావడంలేదు. ఒకసారి భారీ వర్షం కురిస్తే అటు పంటలు, ఇటు కూలీలకు మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు.

ధరలు తగ్గించాలి

గట్టు: నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద అన్నారు. ధరల పెంపుపై మండల కేంద్రంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంట గ్యాస్, నిత్యావసర సరకులు, కూరగాయల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కామాక్షి, ఫాతిమా, రాణి, సునీత, పావని, పరిమళ పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై అవగాహన ఉండాలి

శాంతినగర్: సోషల్ మీడియాపై అందరికీ అవగాహన ఉండాలని బీటీసెల్ మండల కన్వీనర్ ఓనేష్ అన్నారు. వడ్డేపల్లి మండలం రామాపురంలో మంగళవారం సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. సమాజానికి అవసరమయ్యే సమాచారం ఎలా పంపాలి, వీడియో ఎడిటింగ్, ఫొటో ఎడిటింగ్ తదితర విషయాలను వివరించారు. శరత్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



అయిజ: పట్టణంలోని అక్షర ఉన్నత పాఠశాలలో మంగళవారం బోనాల వేడుకను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన బోనాలతో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థుల ధర్నా



ధరూరు: గద్వాల–రాయిచూరు రూట్‌లో అదనపు బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అల్వాలపాడు గ్రామంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు సరిపడా బస్సులను నడపకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాయిచూరు నుంచి వచ్చే బస్సులు మైలగడ్డ స్టేజీ వరకే నిండిపోతుండడంతో అల్వాలపాడు స్టేజీ నుంచి ఆపడంలేదని తెలిపారు. రోజూ పాఠశాలలు, కళాశాలలకు సకాలంలో వెళ్లకపోవడంతో ఒకటి రెండు క్లాస్‌లను మిస్ అవుతున్నామని వాపోయారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శివానందంగౌడ్ అక్కడికి చేరుకుని విద్యార్థులతో నచ్చజెప్పారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

మహా ఉద్యమాన్ని విజయవంతం చేయండి

శాంతినగర్: ఆగస్టు 1న నిర్వహించనున్న విద్యార్థి మహా ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్ కోరారు. శాంతినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏబీవీపీ మహా ఉద్యమం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.5,300 కోట్ల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాక ఖాళీగా ఉన్న 15వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలోని 6,800 పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉండడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో మూతపడిన 8,624 పాఠశాలలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. దగాపడిన తెలంగాణలో మార్పు కోసం లక్షమంది విద్యార్థులతో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ జోనల్ ఇంచార్జ్ కరుణాకర్, నాగేష్, జితేందర్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ఓ కాలనీలో ఒంటరిగా నివాసం ఉంటున్న తనపై ఆదివారం దాడి చేసిన కురుమన్నపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని మంగళవారం కావలి సంధ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయాన్ని అదునుగా తీసుకున్న నిందితుడు మిరాసిపల్లికి చెందిన కురుమన్న తన మెడకు టవల్ చుట్టి, బట్టలు కత్తిరించే కత్తెరతో పొడవడంతో తీవ్రంగా గాయపడ్డానని, ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా.. సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు వేగంగా చర్యలు తీసుకొని నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాధితురాలు వేడుకున్నారు.

సుబాబుడల్!

- తగ్గిన సాగు విస్తీర్ణం
- గతేడాది ధరలు లేక రైతుల ఆందోళన
- సగానికి పైగా చెట్లు తొలగింపు
- ఆయిల్‌పాం సాగుపై దృష్టి



జూలెకల్ శివారులో రెండో పంటకు వదిలిన సుబాబుల్ చెట్లు

శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గంలో పదేళ్ల కిందట ఎక్కడ చూసినా పచ్చని సుబాబుల్ చెట్లతో పొలాలు కళకళలాడేవి. ఆర్డీఎస్, తుంగభద్ర నదీతీర పొలాల్లో పెద్దకారు రైతులు 10 నుంచి 50 ఎకరాల వరకు సుబాబుల్ చెట్లు పెంచేవారు. గ్రామాల్లో నివాసం లేకుండా పట్టణ ప్రాంతాల్లో ఉండే పెద్దకారు రైతులు సుబాబుల్ సాగుపై ఆసక్తి కనబరిచారు. ఒకసారి మొక్కలు నాటితే 15ఏళ్ల వరకు పంట దిగుబడి వస్తోంది. ప్రతి మూడున్నరేళ్లకు ఒకసారి చెట్లను కట్ చేసి అమ్ముకుంటూ లాభాలు గడించేవారు. ఎకరానికి 40 నుంచి 50 టన్నుల వరకు దిగుబడి రావడం, పదేళ్ల క్రితం టన్ను రూ.3,800 ఉండడంతో ఏ పంట సాగుచేసినా అంత దిగుబడి, ఆదాయం రాదనే పరిస్థితికి వచ్చారు రైతులు. దీంతో సన్నకారు రైతులు సైతం సుబాబుల్ సాగుపై ఆసక్తి కనబరిచారు. అయితే గత రెండేళ్లుగా సుబాబుల్ ధరలు అమాంతం పడిపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కనీసం కౌలు డబ్బులు రాని పరిస్థితి నెలకొంది. గతేడాది టన్ను రూ.1500కు పడిపోవడంతో చేసేదిలేక ఉన్న చెట్లను అమ్ముకుని వేళ్లతోసహా తొలగించారు. కొందరు మూడేళ్లలోపు ఉన్న చెట్లను సైతం తొలగించి ఇతర పంటల సాగుకు సిద్ధమయ్యారు. 15ఏళ్ల వరకు పంట దిగుబడి తీయాలని ఆశించిన రైతులు మధ్యలోనే తొలగించడంతో సుబాబుల్ సాగు గణనీయంగా తగ్గిపోయింది.

తగ్గిన నెమళ్ల సంచారం..

గతంలో ఎక్కడ చూసినా సుబాబుల్ చెట్లతో వ్యవసాయ పొలాలు అడవిని తలపించేవి. పక్షుల రాగాలు, నెమళ్ల నాట్యాలు కనిపించేవి. నెమళ్ల సంఖ్య విపరీతంగా పెరిగి పొలాల్లో సంచరించేవి. గతేడాది నుంచి సుబాబుల్ చెట్ల తొలగింపుతో నెమళ్లు దూర ప్రాంతాలకు వెళ్లిపోయాయి. అంతేగాక పక్షుల కిలకిల రాగాలు ఆగిపోయాయి.

సుబాబుల్ సాగు వివరాలు..

మండలం	రైతులు	ఎకరాలు
అలంపూర్	-	-
ఇటిక్యాల	3	15.11
మానవపాడు	128	464.22
ఉండవెల్లి	64	294.29
అయిజ	02	08.10
రాజోళి	253	1031.00
వడ్డేపల్లి	294	816.31
మొత్తం	744	2630.23

మూడోవంతు సాగుకే పరిమితం..

గత పదేళ్ల క్రితం నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 1800 మంది రైతులు 7,550 ఎకరాల్లో సుబాబుల్ సాగు చేయగా, ప్రస్తుతం 744 మంది రైతులు 2,630 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీంతో సాగు విస్తీర్ణం మూడోవంతుకు పడిపోయింది. పొలాలు ఎడారిలా మారిపోయాయి.

రియల్ వ్యాపారులకు విక్రయం..

సుబాబుల ధరలు పడిపోవడంతో ఇక పంట సాగుచేస్తే వచ్చేదేమీ లేదని పెద్దకారు రైతులు వారి పొలాల్లోని సుబాబుల్ చెట్లు తొలగించి రియల్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఎకరం రూ.20లక్షల వరకు పలకడంతో అమ్మకాలపై దృష్టి సారించారు.

ఆయిల్‌పాం సాగుకు సమాయత్తం..

సుబాబుల్ చెట్లు తొలగించిన కొందరు రైతులు ఆయిల్‌పాం సాగుకు సమాయత్తమవుతున్నారు. ప్రభుత్వం ఆయిల్‌పాం తోటలకు ప్రోత్సాహకాలు అందించడం, పెట్టుబడి సాయంతోపాటు సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం కల్పిస్తుండడం, భవిష్యత్తులో ఆయిల్ పాంను విదేశాలకు ఎగుమతి చేస్తారనే ప్రచారంతో సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

ఏడేళ్లకే తీసేశాను..



ఆర్డీఎస్ ఆయకట్టు కింద వెంకట్రామనగర్ సమీపంలోని పదెకరాల్లో ఏడేళ్ల క్రితం సుబాబుల్ సాగు చేశాను. మూడేళ్ల క్రితం ఒకసారి క్రాప్ తీసుకున్నాను. గతేడాది సుబాబుల్ అమ్ముదామంటే కొనే నాథుడు లేక బ్రోకర్లకు టన్ను రూ.1500 ప్రకారం అమ్ముకున్నాను. కౌలుకు ఇచ్చినా ఏడాదికి రూ.లక్ష వచ్చేది. నష్టం వస్తుండడంతో పూర్తిగా తొలగించి పత్తి నాటాను.

– సత్యప్రసాద్‌రెడ్డి, రైతు, కొంకల, వడ్డేపల్లి మండలం

గిట్టుబాటు ధర లేక..



సుబాబుల్ మొక్కలు నాటిన మూడున్నరేళ్లకు క్రాప్ వస్తుంది. కనీస ధర రూ.4వేలు ఉంటే రైతుకు గిట్టుబాటవుతుంది. పదేళ్ల క్రితమే టన్ను రూ.3,950 ఉండేది. గతేడాది టన్ను రూ.1,600 పోగా, 9 ఎకరాల్లోని చెట్లను ఆరేళ్లకే కొట్టేసి వేళ్లతోసహా తొలగించాను. మరో నాలుగు ఎకరాల్లో సాగుచేసిన సుబాబుల్ చెట్లను మూడేళ్లకే కొట్టేశాము. కొత్త రైతులు మాత్రం ఎవరూ పెట్టడంలేదు. సుబాబుల స్థానంలో పత్తి, మిరప పంట సాగు చేస్తున్నాను.

– తులసీరెడ్డి, రైతు, కలుకుంట్ల, మానవపాడు మండలం

సాగు తగ్గింది..



అలంపూర్ నియోజకవర్గంలో సుబాబుల్ సాగు తగ్గిపోయింది. ఈ ఏడాది కేవలం 2,630 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. సుబాబుల్ సాగుకు ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదు. ప్రస్తుతం ఆయిల్‌పాం సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సుబాబుల్ తొలగించిన కొందరు రైతులు ఆయిల్‌పాం సాగు చేస్తున్నారు. ఆయిల్‌పాం తోటలకు ప్రోత్సాహకాలతోపాటు డ్రిప్ పరికరాలను సబ్సిడీపై ఇస్తున్నాం.

– రాజశేఖర్, ఉద్యానశాఖ అధికారి, అలంపూర్

నాణ్యమైన భోజనం అందించాలి



అలంపూర్ పాఠశాలలో ఫర్నిచర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ఆవరణలో కొందరు మద్యం తాగి సీసాలు వేయడంతోపాటు తలుపులు, కిటికీలను పగులకొట్టడానికి ప్రయత్నించినట్లు హెచ్‌ఎం శ్రీనివాసులు మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల ఫర్నిచర్‌ను ధ్వంసం చేస్తున్నారని చెప్పారు. దీనిపై మున్సిపల్ చైర్‌పర్సన్ స్పందిస్తూ.. ఎస్‌ఐ మహేందర్‌తో మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గట్టు : మండలంలోని నల్లగట్టుతండా, మిట్టదొడ్డి గ్రామాల్లో ఇటీవల శంకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, రాంచంద్రయ్యశెట్టి మాల శ్రీను అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సోమవారం రాత్రి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, మండల అధ్యక్షుడు శివారెడ్డి, మధుసూదన్‌రావు, నల్లారెడ్డి ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి

అలంపూర్ రూరల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని మండల వైద్యాధికారి ప్రసూన రాణి సూచించారు. మండలంలోని క్యాతూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ కోసం పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు బలమైన ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్ మాట్లాడుతూ 44మంది మహిళలకు బీపీ, షుగర్ పరీక్షలు చేశామని, ముగ్గురిని పెద్దాస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు.16 మంది మహిళల నుంచి రక్తం సేకరించి గద్వాల టీ హబ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రిజ్వానా తాన్వీర్ ఆధ్వర్యంలో మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. సత్యనారాయణ, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమల్‌రావు, ప్రసన్నకుమారి, శారద, పుష్ప పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న వీవీ నర్సింహ

ధరూరు : జిల్లాలో సీడ్ పత్తి సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీవీ నర్సింహ కోరారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో మంగళవారం పత్తి రైతులు, హమాలీ సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. పత్తి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. 2015, 2017, 2018, 2022 సంవత్సరాల్లో పత్తి పంట ఎర్రబడి దిగుబడి రాలేదని, నష్టపోయిన రైతులను ఇప్పటి వరకు ఆదుకోకపోవడం దారుణమన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సీడ్ కంపెనీలు గానీ, ప్రభుత్వం గానీ ఆదుకున్న పాపాన పోలేదన్నారు. ప్రభుత్వం పరిహారం చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహులు, దేవదాసు, వినయ్, , తిమ్మప్ప, మోష, మోహన్, మూకెన్న, రామాంజనేయులు, రాములు, మన్యం, పరశురాము, వెంకటేష్, రాము పాల్గొన్నారు.

కాపరుల నిర్లక్ష్యం.. రైతుకు నష్టం



రైతు సంఘం భవనం ఆవరణలో ఉన్న పశువులు

అయిజ: వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండుముఖం పట్టాయి. వానాకాలంలో ముందుగా సాగు చేసిన పత్తి పంటకు ఎర్ర తెగులు సోకడంతో తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు అప్పులు చేసి రెండవ సారి పంటసాగు చేసుకున్నారు. అయితే పంట పొలాల్లో ఆవుల మందల సంచారంతో రైతులకు నష్టం వాటిల్లుతోంది. పశువుల పెంపకందారులు, కాపరుల నిర్లక్ష్యం కారణంగా పంటలు నాశనమవుతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో మంగళవారం పంట పొలాల్లో సంచరిస్తున్న పశువులను రైతు సంఘం భవనానికి తరలించారు. పశువుల యజమానులు అపరాద రుసుము చెల్లించి పశువులను విడిపించుకోకపోతే గోశాలకు తరలిస్తామని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

గద్వాల అర్బన్: గ్రామపంచాయితీ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరం నుంచి ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యం మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు జీవోనెం.60 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు హనుమంతు, కార్యదర్శి చింతరేవుల కృష్ణ, కార్తీక్, హరీష్, శ్రీనివాస్, బీచుపల్లి, మద్దిలేటి, కల్యాణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అలంపూర్: పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ అలంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే వీఎం అబ్రహంకు వినతిపత్రం అందజేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 6 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. కార్మికుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

మల్దకల్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు కిష్టన్న, రాముడు, గోపాల్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

వర్షాలు కురువాలని పూజలు



పల్లెపాడులో కృష్ణాజలాలు తీసుకొస్తున్న మహిళలు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో వర్షాల కోసం మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. 21 ఎడ్లబండ్లను ప్రత్యేకంగా అలంకరించి ఖానాపూర్ గ్రామ శివారు నుంచి ఆంజనేయస్వామి పటంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిగీతాలను ఆలపించారు.

మానవపాడు: మండలంలోని పల్లెపాడులో కృష్ణానది నుంచి 101 కాడెడ్లతో 1001 బిందెల్లో నీటిని తీసుకొచ్చి దేవతా విగ్రహాలకు అభిషేకం చేశారు. వర్షాలు పడి పుష్కలంగా పంటలు పండాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మారం సత్యారెడ్డి, అయ్యవారిపల్లి సత్యారెడ్డి, శాంతన్న, గురుస్వామి, రాధాకృష్ణాగౌడ్, బీసీరెడ్డి, గోవిందు పాల్గొన్నారు.



కంచుపాడులో ఆంజనేయస్వామి పటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

నులిపురుగులను నిర్మూలిద్దాం



అలంపూర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసూన రాణి

అలంపూర్: పిల్లల్లో నులిపురుగులను నిర్మూలించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని మండల వైద్యాధికారిణి ప్రసూన రాణి అన్నారు. పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో ఉపాధ్యాయులు, ఐకేపీ భవనంలో అంగన్‌వాడీ టీచర్లకు జాతీయ నులిపురుగుల దినోత్సవంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల వ్యాప్తితో ఆకలి మందగించడం, రక్తహీనత, కడుపునొప్పి వంటి లక్షణాలు ఉంటాయన్నారు. నులిపురుగుల నివారణకు 1–19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. మండలంలో మొత్తం 11,092 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. మాత్రలు వేసిన తర్వాత అత్యవసర పరిస్థితుల్లో మండల వైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి మాత్రలు ఇవ్వొద్దన్నారు. జీహెచ్‌ఎస్ బాలాజీ కృష్ణకుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి లక్ష్మీకాంత్, సిబ్బంది అక్కమ్మ, బాలీశ్వరయ్యశెట్టి ఉన్నారు.

గట్టు: నులిపురుగుల నివారణకు అందరూ సహకరించాలని వైద్యాధికారి హరీష్ కోరారు. మండల కేంద్రంలోని రైతువేదికలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో 19ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ హుస్సేని, సూపర్‌వైజర్ బాలమ్మ పాల్గొన్నారు.

మల్దకల్: పిల్లల్లో నులిపురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారి స్వరూపారాణి తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఉపాధ్యాయులు, వైద్యసిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో గుర్తించిన పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని సూచించారు.

రాజోళి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ మధుబాబు గ్రామాల వారీగా వైద్యసిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రల కిట్లను పంపిణీ చేశారు.

అన్నదాతలకు అండగా సర్కారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచి అన్నివిధాలా ఆదుకుంటోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతరేవుల రైతువేదికలో మంగళవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు పంటలకు నిరంతరం కరెంటు ఇచ్చే నినాదం కేసీఆర్‌దని, మూడు గంటల కరెంటు ఇచ్చే నినాదం కాంగ్రెస్ పార్టీదన్నారు. గతంలో నడిగడ్డ ప్రాంతంలో సరైన నీటి వసతి లేక.. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఇక్కడి రైతులు కూలీలుగా మారి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇక్కడికే వలసలు వచ్చేలా పరిస్థితి మారిందన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంతో నడిగడ్డ ప్రాంతం సస్యశ్యామలం అయ్యిందన్నారు. రైతులు ఇప్పుడిప్పుడే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంటే ఓర్వలేక వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. అలాంటి పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నజీమున్నీసాబేగం, జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వరరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ నరహరిగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ సతీష్, ప్రభాకర్‌గౌడ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

బీఎస్పీతోనే సామాజిక న్యాయం

రాజోళి: బీఎస్పీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆ పార్టీ నియోజకవర్గ కోశాధికారి నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చాక సామాజిక న్యాయాన్ని మరిచిపోయి, స్వార్థ రాజకీయంతో అవినీతి పాలన కొనసాగించాయని తెలిపారు. విద్యావంతులు, మేధావుల ఆలోచనలు, ఆశయాలతో ప్రజల కోసం పని చేస్తున్న పార్టీ బీఎస్పీ అని అన్నారు. బంగారు తెలంగాణలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని, ప్రజలు దగా పడుతున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో బీఎస్పీకి పట్టం కట్టాలని కోరారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురం, సాసనూలు గ్రామాల్లో మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో బహుజన ధూంధాం నిర్వహించారు. బహుజనులకు జరుగుతున్న అన్యాయంపై కళాకారులు ఆటపాటలతో అవగాహన కల్పించారు. పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందాలంటే బహుజన రాజ్యం రావాలని పిలుపునిచ్చారు.

సీఐకి సన్మానం

అలంపూర్ సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాజును బీఎస్పీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు, ఇంచార్జ్ ఎంజీ కృష్ణ, తిరుపాల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకులను రానియొద్దు

అయిజ: రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తే చాలనే వారిని రానివ్వొద్దని, ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి అన్నారు. స్థానిక రైతు సంఘం కార్యాలయం ఎదుట మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను అవహేళన చేసేలా మాట్లాడితే సహించమన్నారు. వ్యవసాయం దండగా అన్న నాయకులు కనుమరుగైపోయారని, మూడు గంటల కరెంటు ఇస్తే చాలనే వారికి అదే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రైతులకు నష్టం చేకూరేలా ఇష్టానుసారంగా మాట్లాడితే సహించమని హెచ్చరించారు. కార్యక్రమంలో లక్ష్మన్న, గోవిందు, కృష్ణ, నర్సింహులు, భీముడు, లింగన్న పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని మారమునగాలకు చెందిన వృద్ధ దంపతులు ఈరపోగు బాలమ్మ, సుంకన్నపై దౌర్జన్యానికి పాల్పడిన అశోక్, సుశీలమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలరాజు మంగళవారం తెలిపారు. భూమి కౌలు విషయంలో వారి కోడలు సుశీల, మనువడు అశోక్ దౌర్జన్యం చేయడంతోపాటు బెదిరింపులకు పాల్పడ్డారని, బాధితుల ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.